సాక్షి
కర్నూలు
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



## వెండిరథంపై ఆది దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో సోమవారం స్వామి అమ్మవార్లను వెండిరథంపై అధిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవమూర్తులకు సహస్రదీపార్చన చేశారు.



## .. ఊరూరా భక్తిపారవశ్యం

ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉరుకుంద నుంచి కందుకూరు సమీపంలోని తుంగభద్ర నది వరకు ఉత్సవం సాగింది. 8లో▶

## కన్నీళ్లు తుడుస్తూ..

పేదలకు వైఎస్సార్ బీమా పథకం అండగా నిలుస్తోంది. రైస్ కార్డు కలిగిన వారికి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. గతేడాది 1,431 మంది ఈ పథకం కింద లబ్ధిపొందారు. 8లో▶

## న్యూస్‌రీల్

### బయోమెట్రిక్ అథెంటికేషన్‌కు రెండు రోజులే గడువు

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల మంజూరుకు సంబంధించి బయోమెట్రిక్ అథెంటికేషన్‌కు రెండు రోజులు మాత్రమే గడువు ఉందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్. సబీహా పర్వీన్ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 927 విద్యా సంస్థల్లో ఇప్పటి వరకు 599 విద్యా సంస్థలు మాత్రమే అథెంటికేషన్ పూర్తి చేసుకున్నాయన్నారు. అథెంటికేషన్ పూర్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 12, 13వ తేదిల వరకు అవకాశం ఇచ్చిందన్నారు. అలాగే 2022–23 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులకు(9వ తరగతి నుంచి) బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయించాలన్నారు. ఆ తర్వాత విద్యార్థుల ఆన్‌లైన్ దరఖాస్తులను విద్యా సంస్థల లాగిన్‌లో పరిశీలించి జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపించాలన్నారు. మరింత సమాచారానికి హనుమంతరావు(9059446377), వేణుగోపాల్(9885488088), మహబూబ్ బాషా(9848864449)లను సంప్రదించాలన్నారు.

### శ్రీ మఠంలో వైభవంగా ద్వాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం ద్వాదశి వేడుకలను పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి నిర్మాల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీర, పంచామృతాభిషేకాలు చేశారు. పూజా మందిరంలో జయ, ద్విజయ, మూలరాముల విగ్రహాలకు అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను గజ, చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై శ్రీమఠం ప్రాంగణంలో ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగురాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### ముమ్మరంగా ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): గత ఏడాది ఆవులు, ఎద్దుల్లో ముద్దచర్మ వ్యాధి(లంపిస్కిన్ డిసీజ్) కలకలం సృష్టించింది. ఈ వ్యాధి బారిన పడి అనేక ఆవులు, ఎద్దులు మృత్యువాత పడ్డాయి. ఈసారి ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా తెల్లజాతి పశువులన్నింటికీ ముద్ద చర్మవ్యాధి నిరోధక టీకాలు వేయిస్తోంది. దాదాపు 45 రోజుల క్రితం నుంచే లంపిస్కిన్ వ్యాధి నివారణ లక్ష్యంగా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలో తెల్లజాతి పశువులు 1,88,469 ఉండగా.. వీటన్నింటికీ ముద్ద చర్మ వ్యాధి నివారణకు గోట్‌ఫాక్స్ టీకాలు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 1,51,492 పశువులకు టీకాలు వేశారు.

### శ్రీశైలానికి 5,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా జూరాల నుంచి వరద ప్రవాహం వస్తోంది. జూరాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 5,522 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ఆదివారం నుంచి సోమవారం వరకు శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 4,113 క్యూసెక్కుల నీరు విడుదలైంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 1,750 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,458, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో 10.80 మి.మీ. వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 91.6176 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యామ్ నీటిమట్టం 854.90 అడుగులకు చేరుకుంది.

### 'సుంకేసుల'కు 390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు సోమవారం 390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ స్థామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి స్థామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. దిగువకు నీటి విడుదల నిలిపేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



# హడావుడి తమ్ముళ్లు.. కనిపించని కామ్రేడ్లు!

టీడీపీ నేత టీజీ భరత్‌కు సంబంధించిన మౌర్యాఇన్‌లో తెరచుకున్న షాపులు



ఇవి టీడీపీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్ కుటుంబానికి చెందిన వ్యాపార సముదాయం. ఇందులో సినిమా హాళ్లతో పాటు హోటళ్లు, వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అయితే టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చినా ఆ పార్టీకే చెందిన నేత వ్యాపార సముదాయం తెరుచుకోవడం చూస్తే ఆ పార్టీ నేతలు అధిష్టానం ఆదేశాలకు ఏమాత్రం ప్రాధాన్యత ఇచ్చారో అర్థమవుతోంది.

రాజ్‌విహార్ సర్కిల్‌లో యథావిధిగా తిరుగుతున్న వాహనాలు



**జిల్లాలో ఊసేలేని బంద్**

- యథావిధిగా ఆర్టీసీ సర్వీసుల కొనసాగింపు
- రోడ్డెక్కిన ఆటోలు, ఇతర వాహనాలు
- నిరంతరాయంగా వ్యాపారాలు
- ఎక్కడికక్కడ పోలీసుల గట్టి బందోబస్తు

కర్నూలు(అర్బన్): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రిమాండ్ నేపథ్యంలో సోమవారం ఆ పార్టీ రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. అయితే జిల్లా కేంద్రంతో పాటు ఏడు నియోజకవర్గాల్లోనూ ఎక్కడా బంద్ ప్రభావం కన్పించలేదు. రోజు లాగే యథావిధిగా జనజీవనం సాగింది. ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు బంద్‌ను ఏమాత్రం పట్టించుకోలేదు. నిర్ణీత సమయానికే వ్యాపార, వాణిజ్య సముదాయాలు తెరిచారు. చివరకు సొంతపార్టీ నేతలు, కార్యకర్తలు కూడా బంద్ చేసేందుకు రోడ్డుపైకి రాకపోవడం గమనార్హం. ప్రతిపక్షనేత రిమాండ్, టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

రాష్ట్ర చరిత్రలో జైలుకు వెళ్లిన తొలి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈ నేపథ్యంలో బంద్‌కు స్పందన వస్తుందని టీడీపీ అధిష్టానం భావించింది. మరోవైపు జనసేన, బీజేపీ, సీపీఐలు కూడా చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీకి అనుకూలంగా ప్రకటనలు ఇచ్చారు. దీంతో ఈ పార్టీలన్నీ కలిసి వస్తాయని, బంద్ విజయవంతం అవుతుందని భావించారు. అయితే మిగిలిన పార్టీల సంగతి పక్కనపెడితే టీడీపీ కార్యకర్తలు కూడా రోడ్డెక్కలేదు. జిల్లా ప్రజలు కూడా టీడీపీ స్పందన చూసి నివ్వెరపోయారు. బహుశా ప్రజలకు మేలు చేయడంలో భాగంగా బంద్‌కు పిలుపునివ్వకపోవడం, ప్రజల సొమ్మును స్వాహా చేసిన అవినీతి కేసులో జైలుకు వెళ్లడంతో ప్రజల నుంచి కూడా మద్దతు కరువైంది. కర్నూలులో టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్‌కు చెందిన మౌర్య కాంప్లెక్స్, సిటీ స్క్వయర్‌లాంటి మాల్స్ కూడా తెరిచే ఉంచారు. జిల్లాలో తక్కిన నియోజకవర్గ కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి. దీన్ని బట్టి టీడీపీ నేతలే బంద్‌ను పట్టించుకోలేదని స్పష్టమవుతోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో లబ్ధి పొందినవారు, జన్మభూమి కమిటీల సభ్యులు, పార్టీకి చెందిన చోటా మోటా నేతలు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డుపైకి వచ్చి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేసి వెళ్లిపోయారు. ఇది మినహా బంద్ వాతావరణమే లేకపోయింది. సీపీఐ, జనసేన, ఎమ్మార్పీఎస్ నేతలు బంద్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ వారు కూడా రోడ్డుపై కన్పించలేదు.



కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు తిరుగుతున్న బస్సులు



నైరాశ్యం: పార్టీశ్రేణులు ముఖం చాటేయడంతో కళతప్పిన టీడీపీ కార్యాలయం

కర్నూలులో తెల్లవారుజాము నుంచి యథావిధిగా ఆర్టీసీ బస్సులు నడిచాయి. బంద్ ప్రభావం ఒక్క బస్సు సర్వీసును కూడా ఆర్టీసీ అధికారులు ఆపలేదు. తక్కిన డిపోల్లో కూడా ఇదే పరిస్థితి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వీసులు కొనసాగించారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ ఆర్టీసీ డిపోల వద్ద కూడా బంద్ ప్రభావం కన్పించలేదు.

**ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసుల పటిష్ట బందోబస్తు**

చంద్రబాబు అరెస్టయిన రోజు నుంచి జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. బంద్ నేపథ్యంలో సోమవారం 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో బందోబస్తును పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని వివిధ ప్రాంతాలు, జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యాలయాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే ఎక్కడా బంద్ ప్రభావం కనిపించకపోవడంతో వారికి కూడా పని తప్పింది. బంద్‌ను పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తెల్లవారుజాము నుంచే పోలీసులు అయా ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లకు చేరుకున్నారు. అయితే ఎక్కడ కూడా బంద్ ఛాయలే కనిపించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

- ➤ ఆదోనిలోని టీడీపీ నేతలు ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద కేవలం పట్టుమని పది నిమిషాల సేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి జనజీవనం సాఫీగా సాగింది.
- ➤ పత్తికొండలో సోమవారం వారపు సంత కావడం, బంద్ ప్రభావం ఉంటుందని అందరు భావించారు. అయితే ఇక్కడ కూడా నేతలు తమ పార్టీ కార్యాలయం వద్ద టైర్లు తగులబెట్టి కొంత సేపు నిరసన వ్యక్తం చేశారు. వారపు సంతకు ఎలాంటి అంతరాయం కలుగలేదు.
- ➤ ఎమ్మిగనూరులో కూడా కొందరు నేతలు ఆర్‌టీసీ డిపో వద్ద ఉదయం నిరసన వ్యక్తం చేసి వెళ్లిపోయారు. మిగిలిన కోడుమూరు, మంత్రాలయం, కర్నూలు ప్రాంతాల్లో కూడా ఎలాంటి బంద్ ప్రభావం కనిపించలేదు.



అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో తెరుచుకున్న దుకాణాలు



యూకాన్ ప్లాజాలో యథాతథంగా బ్యాంకులు



మూతపడని పెట్రోల్ బంకు

## టీడీపీ బంద్ హాస్యాస్పదం

- విలేకరుల సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు(సెంట్రల్): ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పుతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్తే.. దానిని నిరసిస్తూ టీడీపీ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. టీడీపీ నాయకుల బంద్‌కు ప్రజల నుంచి స్పందన కరువైందన్నారు. ఉమ్మడి కర్నూలులో యథావిధిగా బస్సులు తిరగడంతోపాటు వ్యాపార, వాణిజ్య సముదాయాలు పనిచేశాయన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల పాలనలో చేయని స్కాంలు లేవన్నారు. ఏలూరు భూకుంభకోణం నుంచి అమరావతి వరకు అన్ని స్కాంల్లో వేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి ఇన్నాళ్లు కోర్టు స్టేలతో జైలుకు వెళ్లకుండా ఉన్నారని, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పక్కా ఆధారాలు ఉండడంతో తప్పించుకోలేకపోయారన్నారు. టీడీపీ బంద్‌కు పవన్‌కల్యాణ్ మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ఆయన టీడీపీలో ఉన్నారో లేదంటే జనసేన అధినేతనో తెలియడంలేదన్నారు. చంద్రబాబు చేసిన అన్ని కుంభకోణాల్లో విచారణ జరగాలన్నదే వైఎస్‌ఆర్‌సీపీ ప్రధాన డిమాండ్ అన్నారు.

# ఆధునిక 'స్పందన'



ఆధునీకరించిన కాన్ఫరెన్స్ హాలు



కాన్ఫరెన్స్ హాలును ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య తదితరులు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో పునర్నిర్మించిన కాన్ఫరెన్స్ హాలు ఆధునిక సొబగులతో స్వాగతం పలుకుతోంది. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ పనులు చేపట్టారు. ఇందులో మౌలిక వసతులకే దాదాపు రూ.6 లక్షల వరకు ఖర్చుచేశారు. స్టేజీపై దాదాపు 8 మంది అతిథులు కూర్చునేలా డిజైన్ చేయగా, 80మంది అధికారులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రతి టేబుల్‌పై మైకులను అందుబాటులో ఉంచారు. ఇటీవల ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో సోమవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్‌డీఓ హరిప్రసాదు, జెడ్పీసీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎస్‌ఐ పరుగు పోటీల్లో 409 మంది ఎంపిక



పరుగులో పోటీ పడుతున్న ఎస్‌ఐ అభ్యర్థులు

కర్నూలు: రాయలసీమ జోన్ ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్‌పీ రెండో పటాలం మైదానంలో 12వ రోజు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు. సోమవారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 800 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 579 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తరువాత బయోమెట్రిక్ ఎత్తు, ఛాతీ కొలతలు పరీక్షించారు. అనంతరం శారీర సామర్థ్య పరీక్షలు 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 409 మంది అభ్యర్థులు ప్రతిభ కనబరిచి తుది రాత పరీక్షకు (మెయిన్స్) అర్హత సాధించారు. ఈవెంట్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు అందరూ ఒరిజనల్ మార్క్స్ మెమోతో పాటు మూడు సెట్లు గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన జిరాక్స్ కాపీలు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

## అమరవీరుల సేవలు చిరస్మరణీయం



అమర వీరులకు జోహార్లు చెబుతున్న అటవీ శాఖ ఉన్నతాధికారులు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ అమర వీరుల సేవలు చిరస్మరణీయమని ఆ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ కొనియాడారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. చీఫ్ కన్జర్వేటర్‌తో పాటు డీఎఫ్‌వో పి.శివశంకర్‌రెడ్డి, రేంజర్లు, అటవీ శాఖ ఉద్యోగులు అమర వీరు స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 23 మంది అటవీ శాఖ ఉద్యోగులు విధి నిర్వహణలో అమరులయ్యారన్నారు. వారి సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సోషల్‌ఫారెస్ట్ ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్, కర్నూలు ఎఫ్‌ఆర్‌వో సూర్యచంద్రరాజు, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌వో సుదర్శన్, మేనేజర్ అబ్దుల్ సుభాన్, సూపరింటెండెంట్ రామచంద్రరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 30 నుంచి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాలు, నాలుగు పట్టణ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఒక క్యాంపు చొప్పున వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందుకోసం ఈ నెల 15 నుంచి ఇంటింటికి తిరిగి సమాచారమందిస్తారన్నారు. అనంతరం ఏఎన్‌ఎం ఆ ఇళ్లకు వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్‌చేసి, వారికి ఒక తేదీ ఇచ్చి ఆ రోజున వైద్యశిబిరానికి రావాలని సూచిస్తారన్నారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి వైద్యులు పరీక్షించి మందులు ఇస్తారని, అవసరమైన జిల్లా ఆసుపత్రి, బోధనాసుపత్రులకు రెఫర్ చేస్తారన్నారు. ప్రతి వైద్యశిబిరంలో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్టులు ఉంటారని, అందులో ఒకరు మహిళా డాక్టర్ ఉంటారని చెప్పారు. సమావేశంలో డీపీఎంయు డాక్టర్ ఉమా, డెమో ప్రమీలాదేవి, ఎస్‌వో హేమసుందరం పాల్గొన్నారు.